మనం
కృష్ణా-గుంటూరు
ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల
ఆదివారం - 01- మార్చి - 2026 పేజీలు-6

## ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ కు ఏపి ఎన్జిజీఓ నేతల అభినందనలు



2

### దశాబ్దాలుగా వెంటాడుతున్న సమస్యకు

# ఎంపీ కేశినేని శివనాథ్ కృషితో శాశ్వత పరిష్కారం

## ఏ.కొండూరు మండలానికి కృష్ణాజలాలు



**జలజీవన్ మిషన్ కింద కిడ్నీ బాధితులకు కృష్ణాజలాలు అందించే పనులు పూర్తి**
**కృష్ణానది నుంచి తాగునీరు అందించేందుకు పూర్తైన పైప్‌లైన్ల ఏర్పాటు, ట్యాంకుల నిర్మాణం**
**మొత్తం 38 ప్రభావిత ప్రాంతాలకూ ఒకేసారి నీరు అందించేలా ఏర్పాట్లు**
**ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు లేదా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చే ప్రారంభం**

**ఏ కొండూరు ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** ఏ.కొండూరు మండల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించ నుంది. ఎంపీ కేశినేని శివనాథ్ కృషితో కిడ్నీ బాధితులకు స్వచ్ఛ జలాలు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద సూమారు రూ.50 కోట్ల తో నిర్మిస్తున్న కృష్ణా జలాల ప్రాజెక్ట్ తుది దశకు చేరుకుంది. మండలంలోని 38 గ్రామాలకు 100 శాతం ఇంటింటా పైపు కనెక్షన్లు కల్పించే లక్ష్యంతో ఎంపీ కేశినేని శివనాథ్ ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ సీపీడబ్ల్యూఎస్ విస్తరణ పనులు వేగవంతం చేయించారు. ఏ.కొండూరు మండలంలోని 38 గ్రామాల్లోని 56,481 జనాబాకు 43 పాత ట్యాంకులు (ఓ. హెచ్.ఎస్.ఆర్ లు) రిపేరు చేయించటంతోపాటు, 12 కొత్త ట్యాంకులు (ఓ. హెచ్.ఎస్.ఆర్ లు) నిర్మించటం జరిగింది. ఇబ్రహీంపట్నం వి.టి.పి.ఎస్ కెనాల్ నందు ఫిల్టర్ చేసి ఈ 55 ట్యాంకులకు (ఓ. హెచ్.ఎస్.ఆర్ లు) శుద్ధి చేసిన నీటిని కుదప వరకు, అక్కడి నుంచి విస్సన్నపేట, గంపలగూడెం, .కొండూరు మండలం లోని 38 గ్రామాల్లో ఇంటింటికి త్రాగునీటి సరఫరా చేయబడు తుంది. జల్ జవన్ మిషన్ కింద 2023 లో సూమారు 50 కోట్ల వ్యయంతో కృష్ణా జలాల ప్రాజెక్ట్ మంజూరు కాగా, గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా చేసింది. ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చిన తర్వాత ఎంపీ కేశినేని శివనాథ్ కిడ్నీ బాధితులకు కృష్ణాజలాలు అందించాలనే లక్ష్యంతో తరుచూ ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికా రులతో సమావేశాలు

వివరాలు 2 లో..

**సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను మరోసారి పరిశీలించిన. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు**



వివరాలు 5 లో..



## రంజాన్ లో శక్తివంతం కావటానికి మార్గదర్శకాలు

**గాంధీనగర్ ఫిబ్రవరి 28 మనం న్యూస్:** పవిత్ర రంజాన్ మాసంలో రోజువారీ బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూనే, తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు 30 రోజుల పాటు ఉపవాసం ఉండటం శారీరకంగా శ్రమతో కూడుకున్నదిగా అనిపిస్తుంది. రోజంతా స్థిరమైన రీతిలో శక్తిని నిర్వహించడానికి కీలకమైంది. సెహ్రీలో మనం సమతుల్య, నెమ్మదిగా విడుదల చేసే ఆహారాలపై ఎక్కువగా దృష్టి సారించవలసి ఉంటుంది. ఇవి శక్తిని నిలుపుకోవటానికి, అలసటను నివారించడానికి సహాయపడతాయి.

పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు స్థిరమైన రీతిలో శక్తిని అందించటంతో పాటుగా దీర్ఘకాలిక సంతృప్తిని అందించడంలో సహాయపడతాయి. రోజంతా నిరంతర శక్తి కోసం కాలిఫోర్నియా బాదం, ఓట్స్, గుడ్లు, విత్తనాలతో కూడిన గ్రీకు యోగర్ట్, అరటిపండ్లను ఆహారంలో చేర్చుకోవాలని మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దర్ సూచించారు.

## మంజూరైన పరిశ్రమల యూనిట్ల స్థాపనలో వేగం పెంచాలి

### అడ్డంకులు వెంటనే తొలగించాలి.. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం, ఫిబ్రవరి 28(మనం న్యూస్)** జిల్లాలో మంజూరైన పరిశ్రమల యూనిట్లను సత్వరమే స్థాపించేందుకు ఎదురవుతున్న అడ్డంకులను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టర్ తన చాంబర్లో పరిశ్రమల అధికారులు, ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో మంజూ రైన 230 పరిశ్రమల యూనిట్ల పురోగతిని యూనిట్ వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రా మిక వాడ లో మంజూరై ఇంకా స్థాపించని పరిశ్రమల యూనిట్లకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, ప్రణాళిక ఆమోదాలు, రిజిస్ట్రేషన్లు తదితర అన్ని సౌకర్యాలను వెంటనే కల్పించాలని సూచిం చారు. యూనిట్లు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదో సంబంధిత పారిశ్రా మికవేత్తల నుంచి వివరాలు తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. మంజూరైన యూనిట్లకు సంబంధించిన అనుమతుల వివరాలను వెంటనే పారిశ్రా మికవేత్తలకు తెలియజేసి యూనిట్లు స్థాపిం చేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. పారిశ్రామికవేత్తలకు ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు అధి కారులు చొరవ చూపాలని స్పష్టం చేశారు. అన్ని విధాలుగా సహకారం అందిం చినప్ప టికీ యూనిట్లు స్థాపించేం దుకు ముందుకు రాకపోతే సంబంధిత పారిశ్రామికవేత్తలకు నోటీసులు

వివరాలు 2 లో..

## మత్తు పదార్థాల విముక్త సమాజమే లక్ష్యం

**'ఆకర్ష ఫౌండేషన్' ఉచిత కౌన్సిలింగ్ బ్రోచర్‌ను ఆవిష్కరించన నగర కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు**



6

# ప్రధానకార్యదర్శి జి.సాయి ప్రసాద్ కు ఏపి ఎన్జీజీఓ నేతల అభినందనలు



**విజయవాడ ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులై శనివారం పదవీ బాధ్యతలు చేపట్టిన జి.సాయి ప్రసాద్ ను ఏపీ ఎన్ జి జి ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు నాయకులు రాష్ట్ర సచివాలయంలో ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం విద్య వైద్య ఆరోగ్య వ్యవసాయ పారిశ్రామిక తదితర రంగాల పాటు అన్ని రంగాలలో అభివృద్ధి గణనీయంగా మెరుగుపడేలా ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ పూర్తి సహాయ సహకారాన్ని అందిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు సుపరిపాలన ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు ఉద్యోగులు అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి తెలిపారు . ఈ కార్యక్రమంలో ఏపి ఎన్ జి జి ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివి రమణ, కోశాధికారి భారతి ప్రసాద్, ఉపాధ్యక్షులు షరీఫ్, జానీ బాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జానకి, సుబ్బారెడ్డి, సరస్వతి, రాజనీష్, ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఏలూరు జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రమేష్, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, నగర శాఖ అధ్యక్షులు సివిఆర్ ప్రసాద్, అమరావతి క్యాపిటల్ సిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నుపాటి శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ దాసు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ అన్నదాన పథకానికి విరాళం

**విజయవాడ ఇంద్రకీలాద్రి ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** ఏపీఐఐసీ కాలనీకి చెందిన రెడ్డి రాధ మరియు శ్రీ రెడ్డి నాగేశ్వరరావు అన్నదానం నిమిత్తం రూ. 1,08,000/- చెక్కును చైర్మన్ ఛాంబర్‌లో చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) కి అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనం ప్రసాదాల అందజేశారు శేష వస్త్రం అమ్మవారి చిత్రపటం అందజేశారు



## కొండపల్లిలో రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం

**కొండపల్లి, ఫిబ్రవరి 28, (మనం న్యూస్)** విద్యార్థులు ప్రగతి దిశగా ముందడుగు వేస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని, వారి కలలను సాకారం చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు సూచించారు. శనివారం నాడు కొండపల్లిలోని రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ 15వ వార్షికోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ 16 మందితో ప్రారంభమై 44 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో 25వేల మంది విద్యార్థులతో రవీంద్ర భారతి సంస్థ ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. కొండపల్లి రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు సృజనాత్మకత, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను బోధిస్తూ ఉందన్నారు. విద్యార్థులు మార్కులు, ర్యాంకులే కాకుండా మంచి విలువలు, సంస్కారం, కట్టుబాట్లతో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన విధంగా కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని పిలుపునిచ్చారు. మంచి ఆశయాలు ఏర్పరచుకొని నిబద్ధతతో కృషి చేసి ఉజ్వల భవిష్యత్తును సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సమయస్ఫూర్తి, తెలివితేటలు, పట్టుదల, కార్యదీక్ష, ఓర్పు, నిశిత పరిశీలన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వారి అభిరుచికి అనుగుణంగా ఎంచుకున్న వివిధ రంగాలపై తగిన తర్ఫీదు ఇవ్వాలని అన్నారు. స్కూల్ యాజమాన్యానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నిజాల ఆవిష్కరణ!

## కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్





**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** విజయవాడలోని లబ్బీపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గల కళ్యాణ మండపంలో "హిందూ ధర్మ పరిరక్షణ వేదిక" మరియు సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే సెంట్రల్ వైసిపి ఇంచార్జ్ మల్లాది విష్ణు శనివారం నాడు "తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై నిజాలు" శ్రీవారి లడ్డూ ప్రసాదానికి సంబంధించిన యథార్థాలను భక్తులకు తెలియజేస్తూ నిర్వహించిన సదస్సులో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంపై వస్తున్న ఆరోపణలు, దేవాలయాల అభివృద్ధి అంశాలపై కూటమి ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉన్న విశిష్టతను మరియు దానికి సంబంధించిన వాస్తవాలను భక్తులకు వివరించారు. కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డులో జంతు కొవ్వు కలిసిందని ఆరోపణలలో ఎటువంటి వాస్తవాలు లేవని ల్యాబ్ రిపోర్టుల ద్వారా తేట తెల్లం అయిందని కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డు ప్రసాదం పై రాజకీయాలు చేసి భక్తుల మనోభావాలని దెబ్బ తీశారని కూటమి వైఖరి పై నిరసన వ్యక్తం చేసారు.

**లడ్డు వివాదం – రాజకీయ కుట్ర:** తిరుమల లడ్డు నెయ్యి కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమని ఆయన మండి పడ్డారు. కేవలం సొంత వ్యాపార ప్రయోజనాల కోసం (హెరిటేజ్ నెయ్యి విక్రయాల కోసం) మరియు గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడం కోసమే ఈ కల్తీ డ్రామా ఆడారని ఆరోపించారు.

**దేవాలయాల అభివృద్ధిపై సవాల్:** 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో జరిగిన అభివృద్ధికి, 2019-24 మధ్య జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధికి పోలికే లేదని వెలంపల్లి పేర్కొన్నారు. కాణిపాక ఆలయ పునర్నిర్మాణం, గండి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి వంటివి జగన్ హయాంలోనే జరిగాయని గుర్తు చేస్తూ, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

**చంద్రబాబుపై విమర్శలు:** గతంలో విజయవాడలో హిందూ దేవాలయాలను కూల్చివేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని, వాటిని తిరిగి పునర్నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

**ఆచారాలపై ఎద్దేవా:** జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన ఆధ్యాత్మిక చైతన్యం వల్లనే, గతంలో బూట్లతో పూజలు చేసే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మరియు లోకేష్‌లు ఇప్పుడు కనీసం చెప్పులు విప్పి స్టేజీ ఎక్కే పరిస్థితికి వచ్చారని వెలంపల్లి ఎద్దేవా చేశారు.

**కార్యక్రమ అడ్డంకులు:** మల్లాది విష్ణు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పవిత్ర కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నించిందని, ఆటంకాలు సృష్టించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన చీఫ్ సెక్రటరీకి శ్రీ కనక దుర్గమ్మ ఆశీస్సులు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 28, మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జి.సాయి ప్రసాద్ కి విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (కనకదుర్గమ్మ ఆలయం) తరపున అర్చకులు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. ఏపీ సచివాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనా నాయక్ నేతృత్వంలోని అర్చక బృందం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆలయ స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ మరియు ప్రధాన అర్చకులు శ్రీ ఎల్. దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం నూతన సీఎస్‌కు వేద మంత్రోచ్చారణలతో ఆశీస్సులు అందజేశారు.
ఆలయ ఈఓ వి.కె. శీనా నాయక్ శ్రీ కనకదుర్గ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, శ్రీ అమ్మవారి కృపాకటాక్షాలుతో రాష్ట్ర అభివృద్ధిలో సాయి ప్రసాద్ వారి సేవలు విజయవంతం కావాలని ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కృషితో శాశ్వత పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

నిర్వహించి..పనులు వేగవంతం అయ్యే విధంగా కృషి చేశారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ కు ముందు ఆర్.డబ్ల్యు.ఎస్ (గ్రామీణ నీటి సరఫరా) తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ జవనరి 10వ తేదీ ఏ కొండూరు మండలం కోడూరు, పెద్ద తండా గ్రామాల్లో పర్యటించి స్వయంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు, నాణ్యత, పైపు లైన్ ఏర్పాట్లు స్వయం పరిశీలించటం జరిగింది.
మార్చి నెలలోనే కృష్ణా జలాల ప్రాజెక్ట్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభోత్సవం చేసే అవకాశం వుంది.
సీకేడీ గ్రామాలకు తాత్కాలికంగా ట్యాంకర్ నీరు ఏ.కొండూరు మండలంలో సీకేడీ ప్రభావం ఎక్కువగా వున్న 21 గ్రామాలకు కుదప సుంప్ నుండి 4,000 లీటర్ల సామర్థ్యంతో ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు తాగునీరు అందే విధంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఏర్పాట్లు చేశారు. కృష్ణాజలాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే వరకు ట్యాంకర్లతో మంచి నీటి సరఫరా జరిగే విధంగా ఎంపీకేశినేని శివనాథ్ ఏర్పాట్లు చేశారు.
కృష్ణాజలాలు సరఫరా అయ్యే 38 గ్రామాలు

1. కుమ్మరికుంట్ల. 2. పాత రేపూడి
3. కొత్త రేపూడి 4. ఈస్ట్ మాధవరం
5. వెస్ట్ మాధవరం
6. మెట్ట తండా.
7. రేపూడి తండా. 8. కృష్ణారావుపాలెం
9. మాన్సింగ్ తండా. 10. కేస్య తండా
11. పెద్ద తండా. 12. చైతన్య నగర్.
13. చీమలపాడు
14. వెంకట తండా. 15. లక్ష్మీపురం
16. దీప్లా నగర్ 17. కరుణాపురం.
18. కొండూరు తండా
19. ఎ.కొండూరు .
20. పాత కొండూరు .
21. అట్లప్రగడ
22. గొల్లమండల.
23. గొల్లమండల తండా
24.రామచంద్రాపురం.
25. కంభంపాడు
26. కోడూరు. 27. మారేపల్లి .
28. గునిచింతలపాడు
29. పోలిసెట్టిపాడు. 30. కోమటికుంట .
31.గోపాలపురం. 32. వల్లంపట్ల
33. కొత్తూరు.
34. ఎ/ఔ ఆఫ్ హరిజనవాడ
35. వడ్డెర బజార్ ఆఫ్ వల్లంపట్ల.
36. జీల్లకుంట
37. రెడ్డి బజార్ ఆఫ్ వల్లంపట్ల.
38. జానలగడ్డ

ఇంటింటా పైపు కనెక్షన్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుండటంతో ఎ.కొండూరు మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నా రు. సుదీర్ఘకాలం గా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఈ ప్రాజెక్ట్‌తో శాశ్వత పరిష్కారం చూపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# స్థాపనలో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వచ్చే సమావేశంలో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జడ్ఎం బాబ్జి, ప్రత్యేక అధికారులు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డిసిఓ చంద్రశేఖరు, మార్క్ఫెడ్ డిఎం మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి, గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్రారెడ్డి, గనులు భూగర్భ శాఖ ఏజి కొండారెడ్డి, డిఎల్‌డివోలు సునీత శర్మ, రాజేష్ అధికారులు పాల్గొన్నారు

# లీ ఫార్మా ఆధ్వర్యంలో బాస్కర్ విద్యానికేతన్ లో ఉచిత వైద్య శిబిరం

## ఎముకల దృఢత్వానికి నాణ్యమైన ఆహారం తీసుకోవాలి. ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి.



**గాంధీనగర్ ఫిబ్రవరి 28 మనం న్యూస్..** నేటి అధునిక ప్రపంచంలో ఆహారం తీసుకోవడంలో చాల మంది శ్రద్ద వహించడం లేదని,మనిషి జీవన విధానంలో నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడంపై దృష్టి పెట్టాలని,త ద్వారానే మనిషి ఆరోగ్యంగా ఉంటాడాని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి పేర్కోన్నారు. ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరం లీ ఫార్మా లిమిటెడ్ మరియు లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా విశాఖపట్నంలోని గజువాకలో ఉన్న భాస్కర్ విద్యానికేతన్

**లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి.**

స్కూల్‌లో, శనివారం కౌమారదశలో ఉన్న విద్యార్థుల కోసం ఉచిత ఎముకలు మరియు కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.

ఈ శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులు హాజరైయ్యారు. వారికి ఈ వివిధ రకాలైన పరీక్షలు నిర్వహించి, నిపుణులైన వైద్యులు మరియు పోషకాహార నిపుణులచే సలహాలు అందించారు. ప్రదానంగా ఎత్తు మరియు బరువు నడుము మరియు తుంటి కొలతలు చేతి పట్టు బలం పై చేయి చుట్టుకొలత ట్రైసెప్స్ స్కిన్‌ఫోల్డ్ మందం హిమోగ్లోబిన్ పరీక్ష ఫ్లెమింగో బ్యాలెన్స్ టెస్ట్ మరియు ట్యాపింగ్ టెస్ట్ డాక్టర్ మరియు న్యూట్రిషనిస్ట్ సంప్రదింపులు తదితర పరీక్షలు నిర్వహించారు

ఈ కార్యక్రమంలో, కోఆర్డినేటర్లు సరోజిని మరియు జయలక్ష్మి , డాక్టర్ రాధిక , పోషకాహార నిపుణులు మాధురి మరియు క్రాంతి, జి.ఎన్.ఎమ్ భాగ్యలత మరియు లీ ఫార్మా లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. వైద్యులు మరియు పోషకాహార నిపుణులు విద్యార్థుల నివేదికలను పరిశీలించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి తగిన సూచనలు మరియు సలహాలు ఇచ్చారు.

# విద్యార్థులలో శాస్త్ర , సాంకేతిక రంగాలలో జ్ఞానాన్ని పెంపొందించు కొనేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు

**మైలవరం ఫిబ్రవరి 28 మనం న్యూస్:** విద్యార్థులలో శాస్త్ర , సాంకేతిక రంగాలలో జ్ఞానాన్ని పెంపొందించు కొనేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు దోహదం చేస్తాం ౹జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 28-02-2026 న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల లో జాతీయ సేవా పథకం మరియు ఐ ఈ టి ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులలో శాస్త్ర , సాంకేతిక రంగా లలో జ్ఞానాన్ని పెంపొందించు కొనేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు దోహదం చేస్తాయని అలాగే విద్యార్థులలో శాస్త్రీయ వైఖరిని పెంపొందించు కోవడం ద్వారా విజ్ఞానదాయక సమాజం ఏర్పడుతుందని ఆ దిశగా ఉపాధ్యాయులు తమ భోదన పద్దతులలో అటువంటి విలువలకు ప్రాధాన్యత ను ఇవ్వాలని మరియు పాఠశాల స్థాయి నుండే విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన ధరణి, తార్కిక దృష్టి ఏర్పడటానికి వైద్య వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి లో పిల్లలలో ఉన్న ప్రతిభ పాటవాలను వెలికి తీయడానికి, మేధాశక్తి ని పెంపొందిచుకోవడానికి అలాగే వారికి సైన్స్ యెక్క గొప్పతనాన్ని తెలియపరచ డానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, బి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మానవ కాలం నుండి ఆధునిక కాలం వరకు అభివృద్ధి చెందింది అంటే దానికి సైన్స్ కారణమని, సైన్స్ కత్తి వంటిది అని దానికి రెండు వైపులా పదును ఉంటుందని తెలిపారు. ఈ పోటీలు 10 అంశాలలో జరిగాయని ఈ పోటీలలో మైలవరం లోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అలాగే ప్రైవేట్ స్కూల్ లలో



చదివే విద్యార్థిని విద్యార్థులు 47 టీమ్ లు పార్టిసిపేట్ చేసారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల జాతీయ సేవ పథకం అధికారి బి.శివ హరి ప్రసాద్, ఇన్ ఛార్జ్ ఎస్.ఉమా మహేశ్వర రెడ్డి, డీన్లు, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ .ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

**సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలలో విజేతలు వీరే:**

మొదటి బహుమతి : ఏ పీఎస్, డెబ్లు, ఆర్, ఎస్ /జు కాలేజ్ గర్ల్స్ కుంటముక్కల స్కూల్ విద్యార్థులకు 5000/- నగదు, సర్టిఫికెట్, రెండో బహుమతి : శ్రీ చైతన్య టెక్నో స్కూల్ మైలవరం విద్యార్థులకు 3000/- నగదు, సర్టిఫికెట్, మూడో బహుమతి : వివేకా నందా స్కూల్ విద్యార్థులకు 2000/- నగదు, సర్టిఫికెట్. నాల్గోవ బహుమతి : జడ్.పి.హెచ్. స్కూల్ మొరుసుమిల్లి విద్యార్థులకు 1000/- నగదు మరియు జూనియర్ కేటగిరీలో మొదటి మరియు రెండవ బహుమతులను ఎస్.ఎస్.కె స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు సైన్స్ ఫెయిర్ లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేట్ సర్టిఫికెట్ లు అందచేశారు.

# అమ్మవారి సన్నిధిలో మహిళా సెక్యూరిటీ గార్డ్ నిజాయితీ

## నగదు పురస్కారం, పట్టుచీరతో సత్కరించిన ఆలయ ఈవో శీనానాయక్.

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 28 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రి పై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఒక భద్రతా సిబ్బంది ప్రదర్శించిన నిజాయితీ ఆలయ గౌరవాన్ని ఇనుమడింపజేసింది. పోగొట్టు కున్న భక్తుల బంగారు ఆభరణాన్ని తిరిగి అప్పగించిన మహిళా సెక్యూరిటీ గార్డ్ పుట్టా సంతోషిని ఆలయ కార్యనిర్వహణా ధికారి వికె శీనా నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం విజయవాడ గుణదలకు చెందిన సత్య శ్రీనివాస్ (శ్రీధర్) దంపతులు అమ్మవారి దర్శనం



కోసం ఆలయానికి వచ్చారు. తాము కొత్తగా చేయించుకున్న బంగారు బ్రాస్‌లెట్‌ను అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజించుకోవాలనే ఉద్దేశంతో వెంట తెచ్చుకున్నారు. అయితే, దర్శనం అనంతరం క్యూ లైన్లలో తిరిగి వెళ్తుండగా, ఆ ఆభరణం జారి కింద పడిపోయింది. సర్వ దర్శనం క్యూ లైన్ వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డ్ పుట్టా సంతోషికి ఆ బంగారు ఆభరణం దొరకగా, ఆమె తక్షణమే స్పందించి పోలీస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది సమక్షంలో దేవస్థాన అధికారులకు దానిని అప్పగించారు. వెంటనే ఆలయ అధికారులు మైక్ ద్వారా ప్రచారం చేయడంతో, ఆభరణం పోగొట్టుకున్న భక్తులు వచ్చి తగు ఆధారాలు చూపి తమ వస్తువును భద్రంగా తిరిగి పొందారు. ఈవో శీనా నాయక్ సంతోషిని ఆమె నిజాయితీని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "సిబ్బంది ఇలాంటి నిబద్ధతతో పని చేయడం వల్ల దేవస్థానానికి మంచి పేరు వస్తుంది. భక్తులు తాము పోగొట్టుకున్న వస్తువులను తిరిగి పొంది సంతోషంగా వెళ్లడం ముదావహం. నేను కంచి పర్యటనలో ఉన్నప్పటికీ, ఈ విషయం తెలిసి చాలా సంతోషించాను. అందుకే తిరిగి రాగానే ఆమెను సత్కరించాలని నిర్ణయించు కున్నాను."సంతోషి నిజాయితీకి గుర్తింపుగా దేవస్థానం ఈవో తన వ్యక్తిగత సొంత నగదును పురస్కారంగా అందజేశారు. అలాగే దేవస్థానం తరపున అమ్మవారి పట్టుచీరతో ఆమెను ఘనంగా సత్కరించారు.

# వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులను పరిశీలించిన లంక లితీష్

**మైలవరం ఫిబ్రవరి 28 మనం న్యూస్:** పట్టణం లో తిరువూరు రోడ్ లో గల వాటర్ ట్యాంక్ మరమత్తు పనులను స్థానిక నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ మరియు నాయకులు పరిశీలించారు. సచివాలయం 5 పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దినేని శ్రీనివాసరావు , దూరు బాలకృష్ణ , బుడిపూడి వెంకట్రావు, గుండు బోయిన రమణ, మమ్ము తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ లో శక్తివంతం కావటానికి మార్గదర్శకాలు



**గాంధీనగర్ ఫిబ్రవరి 28 మనం న్యూస్:** పవిత్ర రంజాన్ మాసంలో రోజువారీ బాధ్యతలను సమతుల్యం చేసుకుంటూనే, తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు 30 రోజుల పాటు ఉపవాసం ఉండటం శారీరకంగా శ్రమతో కూడుకున్నదిగా అనిపిస్తుంది. రోజంతా స్థిరమైన రీతిలో శక్తిని నిర్వహించడానికి కీలకమైంది. సెహ్రీలో మనం సమతుల్య, నెమ్మదిగా విడుదల చేసే ఆహారాలపై ఎక్కువగా దృష్టి సారించవలసి ఉంటుంది. ఇవి శక్తిని నిలుపుకోవటానికి, అలసటను నివారించడానికి సహాయపడతాయి. పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు స్థిరమైన రీతిలో శక్తిని అందించటంతో పాటుగా దీర్ఘకాలిక సంతృప్తిని అందించడంలో సహాయపడతాయి. రోజంతా నిరంతర శక్తి కోసం కాలిఫోర్నియా బాదం, ఓట్స్, గుడ్లు, విత్తనాలతో కూడిన గ్రీకు యోగర్ట్, అరటిపండ్లను ఆహారంలో చేర్చుకోవాలని మ్యాక్స్ హెల్త్‌కేర్ రీజినల్ హెడ్ ఆఫ్ డైటెటిక్స్ రితికా సమద్దర్ సూచించారు.

# శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో అన్న వితరణ



**గాంధీనగర్, ఫిబ్రవరి 28 మనం న్యూస్:** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజ కార్యక్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాతలు మోహన్ పబ్లికేషన్స్ (రాజమండ్రి) రామచంద్రరావు, పుప్పాల శ్యామంతిక సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, గద్దల ధనలక్ష్మి, దత్తి జ్యోతి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పలుచోట్ల పెన్షన్ పంపిణీ చేసిన లంక లితీష్



**మైలవరం ఫిబ్రవరి 28 మనం న్యూస్:** స్థానిక మండలంలో సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ తెల్లవారుజాము నుండే పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుండి సెలవు దినాలలో ఒకరోజు ముందుగానే పెన్షన్ అందించడం పట్ల పెన్షన్దారులమైన మేము చాలా ఆనందంగా ఉన్నామని, ఈ విధంగా పెన్షన్ పంపిణీ చేసే విధానం పట్ల ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగండ్ల ప్రసాద్, మండల పార్టీ సెక్రటరీ దూరు బాలకృష్ణ, హాస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జల్లి కృష్ణ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ షహీనా బేగం, బీసీ నాయకులు బుడిపూటి వెంకటరావు, అట్ల తిరుపతిరావు, కోసూరు అంజి, మైనార్టీ నాయకులు షేక్ బాజీ, షేక్ సుభాని, షేక్ కరీముల్లా, దాదర్, భాష, వార్డ్ మెంబర్ దుర్గారావు, వాడపల్లి ప్రసాద్, కొండపల్లి రామకృష్ణ, తెలుగుయువత, పాల్గున్నారు.

# యల్.బి.ఆర్.సి.ఈ ఎన్ .ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పార్లమెంటు

**మైలవరం ఫిబ్రవరి 28 మనం న్యూస్:** "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026" కార్యక్రమాన్ని మార్చి 4 వ తేదీన లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివ హరి ప్రసాద్ మరియు, ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి సుంకర రాము పాల్గొన్నారు. ఈ యూత్ పార్లమెంట్ - 2026లో 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన యువత పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తప్పనిసరిగా ముందుగా తమ పేర్లను మై భారత్ పోర్టల్ లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. మార్చి 3 వ తేదీన లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మైలవరం లో జరిగే కార్యక్రమంలో, రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏ భాషలోనైనా "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ: లెసన్స్ ఫర్ ఇండియన్ డెమాక్రసీ" అంశంపై మూడు నిమిషాలు ప్రసంగించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన 5 మంది ని యువతను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వారు మాత్రమే జిల్లా పార్లమెంటు కు నమోదు కావాలని రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాల్సిన నెంబర్లు 9966357021, 8328461854.





## పేద, బడుగు, బలహీన వర్గాలకు కొండంత అండ ఎన్టీఆర్ భరోసా పెన్షన్

### తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. వి. బి. రాజేంద్రప్రసాద్

**ఉయ్యూరు,ఫిబ్రవరి 28 మనం న్యూస్:** ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 4, 15 వ వార్డుల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందించిన రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ పేద,బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రతి నెల 1 వ తేదీనే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని, గతంలో ఉన్న సామాజిక 3000 వేల పెన్షన్ ను 4000 వేలు మరియు వికలాంగ పెన్షన్ 6000 వేలకి పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదని, ఓ పక్క అభివృద్ధి , మరోపక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకు వెళ్తున్న చంద్రబాబునాయుడుకి మనందరం అండగా ఉండాలని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షులు జంపాన గురునాథరావు,తెదేపా నగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రాజులపాటి ఫణి, నాలుగో వార్డ్ అధ్యక్షుడు కొలగాని సాంబశివరావు,15 వార్డ్ అధ్యక్షుడు కటారి తిరుపతిరావు,ఎస్సీ సెల్ నాయకుడు చేదుర్తిపాటి ప్రవీణ్, రవి, చింతయ్య, పరిమి సజిత్, శివ సాయి, రాజు, వికృతి రాజా, భాషి ,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## ఇబ్రహీంపట్నంలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28, (మనం న్యూస్ )** ఇబ్రహీంపట్నం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాడు టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని సీనియర్ టైలర్లు మాట్లాడుతూ టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వం టైలర్ వృత్తిని అధికారికంగా గుర్తించి ప్రతి దుకాణానికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తే ఉపశమనం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. అలాగే పేద టైలర్లను గుర్తించి వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించేందుకు ప్రత్యేక పథకం అమలు చేయాలని కోరారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో ఒక టైలర్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మిషన్లు మరియు సామగ్రి కాలిపోవడంతో నష్టపోయిన టైలర్‌కు అసోసియేషన్ తరపున సభ్యులు కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ చర్యను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.



## పెన్షన్లను పంపిణీ చేసిన మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను శనివారం ఉదయం మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫించన్ పథకంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణం లోనివిలియం పేటలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య అర్హులైన వారికి ఫించన్ నగదును అందించడం జరిగింది. ఈ సందర్భంగా యాక్ట్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి వర్యులు నారా లోకేష్ లు రాష్ట్రంలో పేదలకు జీవన భృతి మెరుగు పరచడం కోసం అర్హులను గుర్తించి,వారికి ఇంటింటికి ఒక్కటవ తారీఖు కన్న ముందు రోజే ఫించన్ నగదు అందించడం ఫించన్ అందుకుంటున్న లబ్దిదారులు ప్రభుత్వం పట్ల, స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య),కెడిడిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం ల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నకిరికంటి వెంకట్,తెలుగుదేశం పార్టీ వార్డు నాయకులు మారేపల్లి శౌరీ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# డ్రగ్స్ బారిన పడితే జీవితం నాశనమే

**యువత అత్యుత్తమ లక్ష్యాలతో ముందుకు సాగాలి.**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

**కేతనకొండలోని ఆర్.కె ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సు.**




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28, (మనం న్యూస్).** డ్రగ్స్ బారిన పడితే జీవితం నాశనమేనని, ప్రతిఒక్కరూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత అత్యుత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కేతన కొండలో ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య పోలీసుశాఖ ఉన్నతాధికారులతో కల్సి డ్రగ్స్ పై దండయాత్ర పేరుతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్. వి రాజశేఖర బాబు డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమంపై ప్రజా ప్రతినిధులను, ప్రజలను, యువతను భాగస్వామ్యం చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తూ అందరినీ చైతన్య పరుస్తున్నారని పేర్కొన్నారు. 36 రోజులు 500 కిలోమీటర్లకు పైగా 'డ్రగ్స్ పై దండయాత్ర' పేరుతో సైకిల్ యాత్ర చేసిన మహిళా పోలీసులు రేవతి, హైమావతి, శైలజ, త్రివేణి, ఉషారాణిలను ప్రత్యేకంగా అభినందించారు. డ్రగ్స్ బారినపడి తమ బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మత్తు పదార్థాలు వినియోగించడం నేరమన్నారు. ఒక్కసారి డ్రగ్స్ ఊబిలోనికి దిగితే బయటపడటం ఎవరి చేతుల్లో ఉండదన్నారు. వారి కుటుంబాలకు కూడా దూరం అవుతారని అన్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగం పట్ల విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ మత్తు పదార్థాలు వాడకుండా నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం అన్నారు. విద్యార్థులు చక్కగా చదివి తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని ఇంటి ముంగిటకు చేర్చి లబ్ధిదారులకు గౌరవంతో సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్... పెన్షన్లు మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** ప్రతి ఇంటి ముంగిటకు సంక్షేమాన్ని చేర్చి , లబ్ధిదారులకు గౌరవంతో కూడిన సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. జగ్గయ్యపేట మండలం, చిల్లకల్లు గ్రామంలో గ్రామానికి చెందిన అర్హులైన పెన్షన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వారి ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లను స్వయంగా అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన ఆరుగురు వివిధ అనారోగ్యాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల బిల్లులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన, తమ సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆరుగురి ఇళ్లకు వెళ్లి స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని, పేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు రావూరి విశ్వనాథం, తాళ్లూరు వెంకటేశ్వర్లు, ముత్తినేని అశోక్, రావూరి శ్రీనివాసరావు, మల్లెబోయిన జ్వాలా, జగ్గయ్యపేట మండల సమైక్య అధ్యక్షురాలు నాయిని రజిని, డోగుపర్తి నాగభూషణం, పసుమర్తి మహేష్, కారుపాటి వినోద్ (పండు), నీటి సంఘం ప్రెసిడెంట్ గాలం కృష్ణ, ఆలూరి రమణ, గాలం నాగేశ్వరరావు, ఎనికె గోపి, పాము సుధీర్, పాము మహేష్, వేల్పుల విజయ్ కుమార్, రోళ్ళకంటి వరబాబు, షేకు ఘఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ రూపంలో ప్రజల చేతికి ప్రభుత్వ భరోసా!

### పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం



**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్:** సంక్షేమం, అభివృద్ధి, పారదర్శకత –సంక్షేమ పింఛన్లతో సమాజానికి అండగా కూటమి ప్రభుత్వం నిలవాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పం ఫలితం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

దూరదృష్టి, సంకల్పబలం ఫలితంగానే ఎన్టీఆర్ భరోసా పథకం సమర్థవంతంగా అమలవుతోందని తెలిపారు. వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు వంటి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచి నిజమైన సామాజిక భద్రతను కల్పిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, పారదర్శకత అనే మూడు సూత్రాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ భరోసా చేరాలనే లక్ష్యంతో పథకాలు అమలు అవుతున్నాయని రఘురాం వివరించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు తమ వంతు కృషి కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగా మంజూరైన మూడు వితంతు పింఛన్లు, రెండు దివ్యాంగ పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గౌరవరం ఎస్సీ కాలనీకి వెళ్లి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు, నేతలు ముత్తవరపు వెంకటేష్, సయ్యద్ జాన్ బాషా,కొప్పుల నాగేశ్వరరావు, బాజీని ధనం మూర్తి మర్రి గోపి రాజు ,దుగ్గిరాల మహేష్,బుజ్జి బాబు పాల్గొన్నారు.

**31వ వార్డులో పెన్షన్లను పంపిణీ చేసిన నెట్టెం రఘురాం**

పట్టణంలోని 31 వ వార్డులో మాజీ మంత్రి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను అందించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా కేవలం పెన్షన్ పథకం మాత్రమే కాదని ప్రతి బలహీన వర్గానికి ప్రభుత్వం ఇచ్చే భరోసా అని ప్రతి కుటుంబానికి అండగా నిలిచే నమ్మకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ ఏ ఇ సుందర రామయ్య పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** పంచాయతీరాజ్ శాఖలో సుందర రా మయ్య చేసిన సేవలు ప్రశంసనీయమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వ రరావు ప్రసంసించారు. పెనుగంచిప్రోలు రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ నందు ఆదిరాజు సుందర రామయ్య పంచాయతీ రాజ్ శాఖలో సుమారు 39 సంవ త్సరాల పాటు వివిధ హోదాల్లో నిబద్ధతతో సేవలందించి శనివారం పదవీ విరమణ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు శుభాకాం క్షలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, జడ్పిటిసి సభ్యులు యేసుపోగు దేవమణి శ్రీనివాసరావు, సుబ్బాయిగూడెం సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, వాణిజ్య అధ్యక్షులు డేరంగుల శీను, జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి నాగబాబు, మండల కార్యదర్శి మెట్టు ఏడుకొండలు, వివిధ మండల సోషల్ మీడియా అధ్యక్షులు నల్లబోతుల వెంకటేష్, పల్లెబోయిన ఉమారామ్ యాదవ్, సయ్యద్ ఆలీ, వివిధ హోదాలలో ఉన్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విజ్ఞాన్ హై స్కూల్స్ లో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు

## అబ్బుర పరచిన విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలు




**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** సైన్స్ దినోత్సవ సందర్భంగా విజ్ఞాన్ నగర్ మరియు కాకాని నగర్ క్యాంపస్ లోని విజ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాల ప్రదర్శన అబ్బుర పరిచింది. భారత దేశ భౌతిక శాస్త్ర వేత్త , నోబెల్ బహుమతి గ్రహీత, భారత రత్న సి.వి రామన్ పరిశోధన ఫలితాలను ధ్రువ పరచిన రోజు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక విజ్ఞాన్ హై స్కూల్ లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిం చారు. విజ్ఞాన్ నగర్ మరియు కాకాని నగర్ క్యాంపస్ ల లోని విద్యార్థులు సుమారు 400 వివిధ రకాల పరికరాలు ప్రదర్శిం చారు. ఈ సందర్భం గా స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరి కారాలు , అవి పని చేసే విధానాన్ని విద్యార్థులు వివరించటం చాలా బాగున్నా యని , ఇటు వంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులలో ఎంతో సృజనాత్మకత పెరుగుతుందని , అవసరాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు ఎలా చేయాలి అని విషయం విద్యార్థులకు బోధ పడుతుందని, ప్రతి విద్యార్థి ఏదో ఒక కొత్త విషయాన్ని కనుగోనాలనే ఉత్సుకత కలుగుతుందని సుధారాణి అన్నారు. రోబో, జెయింట్ వీల్, వాటర్ ప్యూరీఫైర్ , ఎలక్ట్రిక్ రోబో , వాటర్ ఫౌంటైన్, డోర్ అలారమ్ , ఎలక్ట్రిక్ క్విజ్ బోర్డ్, సోలార్ సిస్టం, హైడ్రాలిక్ సిస్టం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాస రచన, వృకృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. విజయ వంతం అవటం కోసం గత 10 రోజులుగా విశేషంగా కృషి చేసిన సైన్స్ విభాగం ఉపాధ్యాయ బృందం విజయ్ , రవిబాబు , శివకన్య, కృష్ణవేణి , ఉదయభాను, శ్రీలక్ష్మి , రత్నకుమారి, ఆషా లను స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

# సుజనా ఫౌండేషన్ మొబైల్ మెడికల్ క్యాంప్ కు వైద్యసహాయం పొందిన వందలాది మంది ప్రజలు...





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 28 (మనం న్యూస్) :** పశ్చిమలో సుజనా ఫౌండేషన్ మొబైల్ మెడికల్ క్యాంపుకు విశేష స్పందన వచ్చింది... శనివారం నియోజకవర్గ పరిధిలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ వ్యాన్ల ద్వారా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు..
కొత్తపేట లోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన మెడికల్ క్యాంపు లో 48, 49 డివిజన్లలోని ఫ్రైజర్ పేట, టైలర్ పేట, జోడు బొమ్మల సెంటర్, తదితర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత మొబైల్ మెడికల్ క్యాంప్ ద్వారా పలు ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు, చికిత్స సహాయం తో పాటు మందులు కూడా ఉచితంగా అంద చేశారు. ఈ క్యాంపులో వివిధ విభాగాల సీనియర్ వైద్యుల కన్సల్టేషన్ తో పాటు ఈసీజీ, ఎక్స్ రే, 2డీ ఎకో , తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు..
అమరావతి కంటి ఆసు పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిం చారు. అవసరమైన వారికి కంటి ఆపరే షన్లు కూడా ఉచితంగా చేయను న్నారు.. అదే విధంగా దంత పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన వైద్య సహాయం కూడా అంద చేశారు.. కార్యక్రమాన్ని సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కార్పొరేటర్లు బుల్లా విజయకుమార్, అప్పాజీ , రాజేష్ లతో పాటు కూటమి నాయకులు, సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు వీరమాచినేని కిరణ్, వెంకట రమణ, హరీష్‌లతో పాటు సుజనా మిత్ర లు పాల్గొన్నారు.



## సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను మరోసారి పరిశీలించిన .నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు,

**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 28 (మనం న్యూస్):** గౌరవ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యాకాంత్. విజయవాడ పర్యటన సందర్భంగా లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ నందు చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్, , జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా, , ఏ.డి.సి.పి. ఎం.బి.ఎం. మురళీ కృష్ణ, సెంట్రల్ ఏ.సి.పి. దామోదర్, ట్రాఫిక్ ఏ.సి.పి. శ్రీ వంశీధర్ గౌడ్ . ఇతర శాఖల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు మరియు ఆయా ప్రదేశాల నిర్వాహకులు పాల్గొన్నారు. గౌరవ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ సూర్యాకాంత్ పర్యటన నేపధ్యంలో పోలీస్ కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ మరియు పరిసర ప్రాంతాలలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. లి ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ లోక్ భవన్, హోటల్ నోవోటల్ మరియు పటమట డొంక రోడ్డులోని ఆంట్రా లక్స్ ఫంక్షన్ హాల్ లలోని బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు మరియు పరిసర ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు మరియు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

# కొండపల్లి కళలకు గ్లోబల్ దిశ

## ఈ--కామర్స్ వేదికలతో అంతర్జాతీయ మార్కెట్ వైపు అడుగులు 150 మంది కళాకారులకు అవగాహన శిబిరం

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28, (మనం న్యూస్ )** శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), ఎన్టీఆర్ జిల్లా పరిపాలన, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొండపల్లి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌లో ఈ--కామర్స్ స్వీకరణ, కమ్యూనిటీ శక్తివృద్ధిపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సుమారు 150 మంది కళాకారులు పాల్గొని ఆసక్తిగా చర్చించారు. ఈ వర్క్‌షాప్‌లో డిజిటల్ వేదికల ద్వారా కొండపల్లి బొమ్మలను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎలా చేర్చాలన్న దానిపై విస్తృతంగా అవగాహన కల్పించారు. వామార్ట్ ప్రతినిధులు ఈ--కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో నమోదు విధానం, ఉత్పత్తుల ఫోటోగ్రఫీ, నాణ్యత ప్రమాణాలు, సరైన ప్యాకేజింగ్, అంతర్జాతీయ రవాణా విధానాలు వంటి అంశాలను వివరించారు. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌ల వినియోగంతో ఎగుమతి అవకాశాలు పెరుగుతాయని, కళాకారుల ఆదాయం స్థిరపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టూరిజం అధికారి శిల్పా మాట్లాడుతూ సంప్రదాయ కళలను ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుసంధానం చేయడం ద్వారా కొండపల్లి కళలకు ప్రపంచవ్యాప్తంగా మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమాలు కళాకారులకు దీర్ఘకాలిక లాభాలు అందిస్తాయని తెలిపారు. అనంతరం ఆర్‌టీఐహెచ్ ప్రతినిధులు మాట్లాడుతూ, మార్కెట్ లింకేజులు, సామర్థ్యాభివృద్ధి శిక్షణలు, ఫార్మల్ వ్యాపార సమీకరణ ద్వారా కళాకారులను గ్లోబల్ విలువ శృంఖలాల్లో భాగస్వాములుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ఈ వర్క్‌షాప్ కొండపల్లి బొమ్మలను 'లోకల్ నుంచి గ్లోబల్' దిశగా తీసుకెళ్లే కీలక ముందడుగుగా నిలిచింది.




# జగ్గయపేట యువతకు ఉపాధి దిశగా ముందడుగు

## 13 మందిని టాటా ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలకు పంపించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** మహిళా సాధికారత సమాజ ప్రగతికి మూలాధారమని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. జగ్గయపేట నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా, శనివారం 13 మంది యువతి/యువకులను టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాల్లో చేరేందుకు తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు యూనిట్‌కు పంపించారు. ఈ సందర్భంగా జగ్గయపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీరాం రాజుగోపాల్ (తాతయ్య) అభ్యర్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండి నాయకత్వం వహించాలి, సమాన అవకాశాలతో తమ ప్రతిభను చాటాలి అని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారత సమాజ ప్రగతికి మూలాధారం అని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని యువతని ప్రోత్సహించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్థిరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షిస్తూ, స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



## తాడేపల్లి వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయం లో జరిగిన జిల్లా సోషల్ మీడియా సమావేశం పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు




**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** తాడేపల్లి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జిల్లా సోషల్ మీడియా సమావేశంలో జగ్గయ్యపేట నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ సోషల్ మీడియా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు దొడ్డా అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి , జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ , జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వరరావు , జిల్లా సోషల్ మీడియా అధ్యక్షురాలు చైతన్యరెడ్డి , రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీహరి , జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు వీరమాచినేని నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు అంబోజీ వినయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి నాగబాబు, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షులు నల్లపోతుల వెంకటెష్, జగ్గయ్యపేట మండల అధ్యక్షులు పల్లెబోయిన ఉమారావు యాదవ్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ బుజ్జి ఆలీ, పాల్గొన్నారు.

# ఒకరోజు ముందుగానే పెన్షన్లు



**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయవాడ సెంట్రల్ 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీ పేట. ఎన్టీఆర్ నగర్ నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్లను అందచేసిన లిఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు.రమణారావు ఈ కార్యక్రమంలో కబీర్, ఇమ్మనుయేల్, అ.అప్పలనాయుడు,ఎ.రాజు, శివ,బాలకృష్ణ, మహిళలు సరోజిని,రేణుక, సాయి, మరియు సచివాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసిన సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు



**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 28 (మనం న్యూస్)** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా మరింత బాధ్యతతో ముందుకు సాగుతాం –ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు . శనివారం ఉదయం 25వ డివిజన్ సీతారామాపురం, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వీధి చివర కాలవ ఒడ్డున మార్చి ఒకటి ఆదివారం కావడంతో వృద్ధులు, వికలాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి నారా . చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా :- ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు స్వయంగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వృద్ధులు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును అందజేశారు. వృద్ధుల ఆశీర్వాదాలు తీసుకుంటూ, వికలాంగుల సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు..

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ:- ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. "సూపర్ సిక్స్" హామీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్ష పార్టీలు ఎగతాళి చేశాయని, ఇవి కేవలం ఓట్ల కోసం చెప్పిన మాటలేనని విమర్శించాయని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా మిగలకుండా అమలు చేసి చూపిస్తున్నామని అన్నారు..

ప్రతి నెల ఒకటో తేదీ పేదలు, వృద్ధులు, వితంతువులకు పండుగ రోజుగా మారిందని, ఉదయం 6 గంటలకే ఇంటింటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వమని...

కేంద్రంలో నరేంద్ర మోడీ , రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సహకారంతో బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందన్నారు, అధికారం మాకు అలంకారం కాదని, అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు, ప్రజలు ఏ నమ్మకంతో గెలిపించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత కృషి చేస్తామని తెలిపారు..

ఈ కార్యక్రమంలో:- సెంట్రల్ నియోజకవర్గ అబ్జర్వర్ దేవతోటి నాగరాజు,బీసీ సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి లుక్కా సాయిరాం గౌడ్, డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపినాథ్, మాచర్ల పావని, సుబ్బారావు, దొంగర. ఆంజనేయులు, బాడీత. సురేష్,సిరిదీప్,కళ్యాణ్,అస్లాం, కృష్ణ,గిరి,సాయి,బీజేపీ నాయకులు ప్రవీణ్ జైన్, శ్రీనివాసరావు, స్థానిక డివిజన్ నాయకులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల విముక్త సమాజమే లక్ష్యం

## 'ఆకర్ష ఫౌండేషన్' ఉచిత కౌన్సిలింగ్ బ్రోచర్‌ను ఆవిష్కరించన నగర కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు

**విజయవాడ క్రైమ్ ఫిబ్రవరి 28 (మనం న్యూస్):** సమాజంలో పెరిగిపోతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు మరియు వ్యసనాలకు బానిసలైన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకువచ్చేందుకు ఆకర్ష ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ఆకర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన "ఉచిత కౌన్సిలింగ్ మరియు డీ–అడిక్షన్ రీహాబిలిటేషన్" బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ?పోలీస్ శాఖ మరియు ఫౌండేషన్ సమన్వయం: ? ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, ముఖ్యంగా యువత గంజాయి, ఆల్కహాల్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, అదే సమయంలో వ్యసనపరులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చి మార్పు తీసుకురావడానికి ఇటువంటి సంస్థల సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈగల్ డిపార్ట్మెంట్ అధికారులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్ శాఖ తరపున ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్: 1972ని అందుబాటులో ఉంచామని, ప్రజలు ఏవైనా ఫిర్యాదులు లేదా సమాచారం ఉంటే ఈ నెంబర్‌కు తెలపాలని కోరారు.

**ఆకర్ష ఫౌండేషన్ సేవలు:** ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గర్రె శంకర్రావు మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో వ్యసన విముక్తి కోసం ఉచితంగా కౌన్సిలింగ్ మరియు రీహాబిలిటేషన్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు సహాయం కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చని సూచించారు:

91009 79893 .-76004 94949 ఈ కార్యక్రమంలో ఈగల్ డిపార్ట్మెంట్ ఇన్స్పెక్టర్ ఎం. రవీంద్ర , ఎస్.ఐ వీరాంజనేయులు , ఆకర్ష ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.ఎస్. రావు ప్రముఖ సైకాలజిస్ట్ నవిత మరియు ఆకర్ష ఫౌండేషన్ పి.ఆర్.ఓ దేవరపల్లి మదన్ ప్రకాష్ పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు. పంపిణీ చేసి న 64వ డివిజన్ టిడిపి అధ్యక్షులు కే రవికుమార్

**విజయవాడ సెంట్రల్ ఫిబ్రవరి 28 ( మనం న్యూస్)** మార్చి ఒకటో తారీకు ఆదివారం కావడంతో ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా ఆదేశాల మేరకు. కండ్రిక 64 వ డివిజన్ బూత్ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సచివాలయం సిబ్బందిని కలుపుకొని దివ్యాంగులకు వికలాంగులకు వృద్ధులకు అందజేశారు ఈ కార్యక్రమంలో 64 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు కే రవికుమార్ స్పెషల్ ఆఫీసర్ డి ఈ ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి ఎస్ కె బాబు,బూత్ కన్వీనర్లు కంకణాల బాబు, పరిమి వెంకట్,తోటకూర రమేష్, సీనియర్ నాయకులు కోరాడ రమణ , పొట్నూరి అప్పలనాయుడు,తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## దేశంలోనే అతి పెద్ద సంక్షేమ .ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షులు గద్దె అనురాధ

**విజయవాడ తూర్పు ఫిబ్రవరి 28( మనం న్యూస్)**దేశంలోనే అతి పెద్ద సామాజిక భద్రతా . ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం నిలిచిందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. శనివారం ఉదయం 13వ డివిజన్ డొంకరోడ్డు ఏరియలో గద్దె అనురాధ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తో కలిసి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం వీరంకి డాంగే కుమార్ కమ్యూనిటీ హాలులోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం పై ఆరా తీశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం మాటల్లో కాదు, చేతల్లో చూపిస్తోందని అన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పింఛన్ల కోసం నెలకు రూ. 1300 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం రూ. 2700 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు.



"సంక్షేమం -- అభివృద్ధి సమపాలన" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఒకవైపు మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరోవైపు సామాజిక భద్రత కల్పనలో సమతుల్య విధానాన్ని అనుసరిస్తోందని అన్నారు. ప్రత్యేకంగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు నెలకు రూ. 15,000 ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వం వారి పట్ల ఉన్న మానవతా దృక్పథాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీడీపీ అధ్యక్షులు నూతి శ్రీనివాస్, వీరంకి కృష్ణకుమారి, శొంఠి నాగేశ్వరరావు, షేక్ నాగూర్, కొర్రపాటి శ్రీనివాస్, మాదిరెడ్డి రవి, హారిక, మానస, జ్యోతి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



**విజయవాడ క్రైమ్ ఫిబ్రవరి 28 (మనం న్యూస్) :** సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, పదవి వీరమణ పొందడం అభినందనీయం. ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించారు, మనమంతా ఒకే పోలీసు కుటుంబం. పోలీసు డిపార్ట్మెంట్ లో ప్రజా సేవకే మీ సమయం, శక్తి అన్ని వినియోగించినందుకు డిపార్ట్మెంట్ తరపున ధన్యవాదాలు.... అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత ఎన్టీఆర్. జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకిత భావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి ది. 28.తేదిన పదవీ విరమణ చేస్తున్న ఐదుగురు పోలీస్ అధికారులకు . పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంనందు పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు . ఆదేశాల మేరకు అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి. సరిత , ఇతర పోలీస్ అధికారులతో కలిసి సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించినందుకు గాను పదవీ విరమణ చేసిన అధికారులను అభినందించి పోలీస్ మర్యాదలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు.

పదవీవిరమణ పొందిన వారి వివరాలు

| క్ర.సం | పేరు | హోదా | విధులు నిర్వహణ |
|---|---|---|---|
| 1) | శ్రీ కె. కోటేశ్వర రావు | సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు | మహిళా పి. ఎస్. |
| 2) | వి. జయమ్మ | సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు, | పి. సి. ఆర్. పి. ఎస్. |
| 3) | శ్రీ పి. శ్రీనివాస రావు, | అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, | రెండవ ట్రాఫిక్ పి. ఎస్. |
| 4) | ఎన్. మధుబాబు, | ఏ. ఆర్. హెడ్ కానిస్టేబులు, | సి. ఏ. ఆర్. |
| 5) | చిలక జ్యోతి . | మహిళా హోంగార్డు, హోంగార్డు యూనిట్. | |

ఈ సంధర్భంగా డి.సి.పి. మాట్లాడుతూ... పధవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాధములు తెలియజేశారు. ఈ నేపధ్యంలో వారి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు.

వారితో మాట్లాడుతూ ఇప్పటి వరకు 24 గంటలూ ఉద్యోగ వీధి నిర్వహణలో బాగంగా చాలా బిజీగా గడిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత తోపాటు, ఏ.ఓ. శ్రీమతి సునీత , ఆర్.ఐ. శ్రీనివాసరావు , ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎం. సోమయ్య, అసోసియేషన్ సంఘ సభ్యులు మరియు అధికారులు, సి.పి.ఓ. సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సురక్షాలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల వెల్ఫేర్ అస్సోషియేషన్ వారితో సమీక్షా సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు

**విజయవాడ క్రైమ్ ఫిబ్రవరి 28 (మనం న్యూస్):** ఈ నెల 6వ తారీఖున ఎన్టీఆర్ జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల వెల్ఫేర్ అస్సోషియేషన్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించిన. సమయంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సేవ చెయ్యడానికి పోలీస్ డిపార్ట్మెంట్ కి సహాయ సహకారాలను అందించాలని తెలుపగా అందరూ సుముఖత తెలిపినారు. లి జీరో టాల్ రెన్స్ ట్నరీ సైబర్ క్రైం లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మొదలైన నేరాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలలో మరో ముందడుగు వేస్తూ .పోలీస్ కమిషనర్ వారి కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలు నందు ఎన్టీఆర్ జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల వెల్ఫేర్ అస్సోషియేషన్ వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ. ప్రజలు డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల భారీన పడకుండా నగరంలో పలు వీనూత్న కార్యక్రమాలు మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, అదేవిధంగా మీ సేవలను కూడా వినియోగించుకుని ప్రజలకు మరిన్ని సేవలను అంధించాలానే సదుద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. అనంతరం వారి సేవలను ఏ విధంగా వినియోగించుకోవాలి అనే విషయం పై కూలకషంగా చర్చించడం జరిగింది.



ఈ సందర్భంగా సంఘ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.... సైబర్ నేరాల, ఇతర నేరాలను నియంత్రించడానికి అవసరమైన సహకారం మన పోలీస్ డిపార్ట్మెంట్ కు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు పోలీక్ వారి సేవలలో సహకారం అంధిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమం లో సైబర్ క్రైమ్ డి.సి.పి కృష్ణ ప్రసన్న పోలీసు అదికారులు, ఎన్టీఆర్. జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల వెల్ఫేర్ అస్సోషియేషన్ అధ్యక్షుడు ఏ.ఎస్.ఎన్.రెడ్డి సెక్రెటరీలు శ్రీ టి. హరికిష్ణగారు, ఎల్.నాంచారయ్య , ఇతర రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు.

## ఏ ఈ సుందర రామయ్య పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 28 మనం న్యూస్ :** పంచాయతీరాజ్ ఏ ఈగా సేవలు అందించి న సుందర్రామయ్య పదవీ విరమణ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని సుందర రామయ్య చేసిన సేవలను కొనియాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలులోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్ నందు పంచాయతీ రాజ్ ఏ ఇగా సేవలు అందించినఆదిరాజు వెంకట నాగలక్ష్మి సుందర రామయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వారికి సామినేని ఉదయభాను వారికి శుభాకాంక్షలు తెలియజే సారు.

